# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 235. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ శుక్రవారం.06.06.2025 పేజీలు:4, వెల:రూ.1.00


## ఏఐతో విద్యానైపుణ్యాన్ని బలోపేతం చేయాలి

హైదరాబాద్ అమృత్ తెలంగాణ: అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో పరిశోధనలతోపాటు విద్యా నైపుణ్యాన్ని బలోపేతం చేయాల్సిన అవసరముందని ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయాలు, అనుబంధ కాలేజీలు దీనిపై దృష్టిసారించాలని కోరారు. మెథడిస్ట్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం రెండురోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. అధ్యక్షత వహించిన బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ ఏఐ ప్రాధాన్యత అన్ని రంగాల్లోనూ పెరుగుతున్నదని చెప్పారు. భవిష్యత్తును రూపొందించడంలో ఏఐ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. సిలబస్‌లోనూ ఏఐని చేర్చి విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఏఐ అండ్ ఎంఎల్ డైరెక్టర్ పివి సుధ మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ఇతర అవకాశాలుంటాయని వివరించారు.

## సీఐడీ చీఫ్‌గా చారుసిన్హా బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్.అమృత్ తెలంగాణ: రాష్ట్ర సీఐడీ విభాగం డైరెక్టర్ జనరల్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి, అదనపు డీజీ చారుసిన్హా గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర క్యాడర్‌కు చెందిన ఆమె ఏడేండ్లుగా సెంట్రల్ రిజర్వుడ్ పోలీసు ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) డైరెక్టర్‌గా కేంద్ర సర్వీసుల్లో బాధ్యతలు నిర్వర్తించారు. జమ్మూకాశ్మీర్, బీహార్, రాజస్థాన్, సదరన్ సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్‌గా ఆమె కీలకమైన బాధ్యతలు చేపట్టారు. నిజాయితీ, చిత్తశుద్ధితో పాటు ముక్కుసూటిగా వ్యవహరించే ఐపీఎస్ అధికారిగా ఆమెకు పేరుంది. సీఐడీతో పాటు మహిళా భద్రతా, షీటీమ్స్, భరోసా సెంటర్ వంటి విభాగాలకు ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు. సీఐడీ వంటి కీలక విభాగానికి డైరెక్టర్‌గా తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడానికి పూర్తి ప్రయత్నం చేస్తాననీ, తనపై ప్రభుత్వం, సీనియర్ అధికారులు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని చారుసిన్హా నవతెలంగాణకు తెలిపారు.

# సర్కారు బడుల్లో విద్యార్థుల నమోదు పెంచడమే లక్ష్యం




హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో 2025-26 విద్యాసంవత్సరంలో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ఈనెల 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతుంది. మొదటిరోజు గ్రామసభ నిర్వహించాలి. ఏడున ప్రతి ఇంటినీ సందర్శించి బడిఈడు పిల్లలను గుర్తించాలి. అయితే బక్రీద్ పండుగ ఉన్నందున ముస్లిం ఉద్యోగులు, ఉపాధ్యాయులు మినహాయింపు ఉంటుంది. ఎనిమిది నుంచి పదో తేదీ వరకు కరపత్రాలతో ఇంటింటి ప్రచారం చేపట్టాలి. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలి. డ్రాపౌట్ పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడంతోపాటు ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను అందుబాటులో ఉన్న భవిత కేంద్రాల్లో చేర్పించాలి. ఈనెల 11న బడిబాట ప్రారంభం నుంచి నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించాలి. 12న పాఠశాలల పున:ప్రారంభం రోజే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజాప్రతినిధులతో ప్రారంభిం చాలి. అదేరోజు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫారాలను అందించాలి. 13న సామూహిక అక్షరాభ్యాసం బాలల సభను నిర్వహించాలి. 16న ఎఫ్‌ఎల్‌ఎన్, లిప్ దినోత్సవం జరపాలి. 17న విలీన విద్య, బాలిక విద్యా దినోత్సవం నిర్వహించాలి. 18న తరగతి గదుల డిజటలీకరణపై అవగాహన, మొక్కల పెంపకంపై ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించాలి. ఈనెల 19న జయశంకర్ బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించాలి. బడిబాటను విజయవంతం చేసేందుకు అన్ని జిల్లాల డీఈవోలు, ఈవో-డీపీవోలు, సమగ్ర శిక్ష అధికారులు తగిన చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలి. అన్ని ఆవాసాల్లో బడిఈడు పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదును పెంచాలనీ, నాణ్యమైన విద్యను అందించాలి. విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించాలి. స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జీ), అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు (ఏఏపీసీ) సహాయం తీసుకుని ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి. విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్ (వీఈఆర్)ను అప్‌డేట్ చేయాలి. పర్మినెంట్ ఎన్‌రోల్‌మెంట్ నెంబర్ (పీఈఎన్)ను అప్‌డెట్ చేయాలి. ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తరగతి, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏడో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఆరో తరగతి, ఎనిమిదో తరగతిలో చేర్పించాలి. తక్కువ పిల్లలున్న పాఠశాలలను గుర్తించి వాటిలో పిల్లల సంఖ్యను పెంచేందుకు ప్రణాళికను రూపొందించాలి. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాలి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సహాయంతో వారి వయసుకు తగ్గ తరగతిలో చేర్పించాలి. బాలికల నమోదును పెంచాలి. తల్లిదండ్రులు, విద్యార్థులు, పౌరసమాజంలో విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) గురించి అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలకు హాజరయ్యేలా చూడాలి. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో కలెక్టర్లు, డీఈవోలు, ఎంఈవోలు, హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు ముఖ్యపాత్ర పోషించాలని విద్యాశాఖ అధికారులు సూచించారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి కాపాడాలి




అమృత్ తెలంగాణ: భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణం అందించేందుకు మొక్కలు నాటి, వాటిని పెంచి కాపాడాలని రవాణా బీసీ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్యమండలి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ గోల్కొండ ఏరియా ఆసత్రిలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహిద్దిన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి మంత్రి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాలుష్య నియంత్రణమండలి పక్షాన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నామని, చెట్లు నీడ ఇవ్వడంతో పాటు ఆక్సిజన్ అందిస్తాయన్నారు. చెట్లను పెంచడం నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో ఆక్సిజన్ మాస్కులు పెట్టుకునే పరిస్థితి ఏర్పడుతుందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని కోరారు. కాలుష్యం పెరిగిపోయి ప్రజలు క్యాన్సర్, షుగర్ వ్యాధుల బారినపడి మందులపై ఆధారపడుతున్నారని, కాలుష్యం పెరగకుండా.. హైదరాబాద్ మరో ఢిల్లీ కాకుండా.. చెట్లు నాటాలన్నారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. గోల్కొండ ఏరియా ఆస్పత్రికి వచ్చే వారికి మొక్కలు నాటడంపై అవగాహన కల్పించాలన్నారు. పర్యావరణాన్ని కాపాడడానికి మొక్కలు నాటి ప్లాస్టిక్‌ను దైనందిన జీవితం నుంచి దూరం చేయాలన్నారు. మొక్కలు పెంచడం మన దిన చర్యగా భావించి పుట్టిన రోజులకు, ప్రత్యేక రోజులకు మొక్కలు నాటాలన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. చెట్లు ప్రగతికి మెట్లని, ప్రతి ఒక్కరూ మొక్క నాటి సమాజంలో మార్పు తీసుకురావాలన్నారు. శుభ కార్యక్రమాల్లో కేకులను కట్ చేసి హంగామా సృష్టించే బదులు మొక్కలు వాడాలన్నారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ జూట్ బ్యాగులను ఉపయోగించాలన్నారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మహియుద్దీన్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు.

గోల్కొండ ఆస్పత్రిలో ప్రతిరోజూ 1200 నుంచి 1500 మంది అవుట్ పేషెంట్లు వస్తున్నారని తెలిపారు. కొత్త భవనం నిర్మించేందుకు రూ.6 కోట్లు, యంత్రాల కొనుగోలు కోసం రూ.1.80 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఆస్పత్రిలో డాక్టర్లు, నర్సులు అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ పి.సురేష్, డీసీహెచ్‌ఎస్ సూర్యకుమారి, ఏరియా ఆస్పత్రి పర్యవేక్షకులు శ్రీనివాసరావు, కార్పొరేటర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, గోల్కొండ ఏరియా ఆస్పత్రి వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు ప్రిపరేషన్




మెదక్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. గ్రామ పంచాయతీ, జిల్లా, మండల పరిషత్‌లకు ఇప్పటికే పదవీ కాలం ముగిసి ఏడాదిన్నర కావస్తుంది. ప్రత్యేక అధికారుల పాలనలో నడుస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందాల్సిన నిధులూ ఆగిపోయాయి. మరో పక్క బీసీ రిజర్వేషన్లు, ఆరు గ్యారంటీల అమలు వంటి సానుకూలాంశాలతో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతోంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం సైతం ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు ఖరారవ్వగా ఈ నెల 21 వరకు పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డుల విభజన, పెంపు ప్రక్రియను పూర్తి చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగల్ ఇవ్వగానే ఎన్నికల సంఘం ఎప్పుడైనా నోటిఫికేషన్ ఇవ్వొచ్చనే అభిప్రాయముంది. దాంతో రాజకీయ పార్టీలు సైతం స్థానిక సంస్థలకు సిద్ధమవుతున్నాయి. ఆశావహులు హడావుడి చేస్తున్నారు.

రాజ్యాంగం కల్పించిన అధికారాలు, విధుల ప్రకారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించాలి. రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులరీత్యా ఐదేండ్ల పదవీ కాలం ముగిసినప్పటికీ ఇప్పటికీ గ్రామ పంచాయతీలు, జిల్లా, మండల పరిషత్‌లు, మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగలేదు. ఎంతో కాలం ఆలస్యం చేయడమంటే రాజ్యాంగ ఉల్లంఘనగా భావించాల్సి వస్తుంది. అందు కోసం రాష్ట్ర ప్రభుత్వం జులై, ఆగస్టులో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపేందుకు సిద్ధం కావాలని అధికార యంత్రాంగాన్ని పురమాయించింది. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్ అధికారులు ఎన్నికల ప్రకియలో నిమగమయ్యారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 1604 గ్రామ పంచాయతీలు, 74 జెడ్పీటీసీ, 696 ఎంపీటీసీ స్థానాలున్నాయి. అదే విధంగా 21 మున్సిపాలిటీలుండగా వీటిల్లో 394 కౌన్సిలర్ స్థానాలున్నాయి. సంగారెడ్డి జిల్లాలో 2019 ఎన్నికల్లో 25 జెడ్పీటీసీ స్థానాలుండగా కొత్తగా చౌటకూర్, నిజాంపేట మండలాలేర్పడ్డాయి. దాంతో 27 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. గతంలో 295 ఎంపీటీసీ స్థానాలుండగా కొత్తగా ఏర్పడిన 4 మున్సిపాలిటీల్లో 11 గ్రామాలను విలీనం చేయడంతో 19 ఎంపీటీసీ స్థానాలు తగ్గడం వల్ల ప్రస్తుతం 276 స్థానాలకే ఎన్నికలు జరగనున్నాయి. 8 మున్సిపాలిటీలుండగా కొత్తగా గుమ్మడిదల, గడ్డపోతారం, కోహీర్, ఇస్నాపూర్ ఏర్పడ్డాయి. వీటిల్లో 76 వార్డులు ఏర్పాటు చేయడంతో జిల్లా వ్యాప్తంగా 12 మున్సిపాలిటీల్లో 236 కౌన్సిలర్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మెదక్ జిల్లాలో గతంలో 20 మండలాలుండగా కొత్తగా మాసాయిపేట ఏర్పడటంతో 21 జెడ్పీటీసీ స్థానాలున్నాయి. కొత్తగా ఒక ఎంపీటీసీ స్థానం పెరగడంతో 190 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నాలుగు మున్సిపాలిటీల్లో 75 వార్డులున్నాయి. సిద్దిపేట జిల్లాలో 26 జెడ్పీటీసీ, 230 ఎంపీటీసీ, ఐదు మున్సిపాలిటీల్లోని 83 కౌన్సిలర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఎన్నికల ప్రక్రియలో అధికార యంత్రాంగం

స్థానిక సంస్థల నోటిఫికేషన్ ఎప్పుడొచ్చినా నిర్వహించేందుకు సిద్దంగా ఉండాలని ఈసీ ఆదేశించడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పనుల్ని చక్కదిద్దుతున్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాత, కొత్త మున్సిపాలిటీల్లో ఈ నెల 21 వరకు వార్డుల విభజన, పెంపుదల ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 'నజరీ నక్ష' పోలింగ్ కేంద్రాల భౌగోళిక మ్యాప్‌లను రూపొందించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల భౌగోళిక సమాచారం, సౌకర్యాలు, రవాణా మార్గాలపై చర్చించారు. ఓటర్ల ఇంటింటి సర్వే ద్వారా పోలింగ్ కేంద్రాల పెంపు, ఒకే కుటుంబం ఒకే పోలింగ్ కేంద్రంలో ఓట్లేసేలా మార్పులు చేయాలని సూచించారు. ఇప్పటికే జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారుల్ని నియమించారు. వారందరికీ ఎన్నికల నిర్వహణపై శిక్షణ కూడా ఇచ్చారు. రాజకీయ పార్టీల గుర్తులపై జరిగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, కౌన్సిలర్ ఎన్నికలతో పాటు పార్టీలకతీతంగా జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాల ముద్రణ కోసం ఏర్పాట్లు సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట మూడు జిల్లాల్లో జరుగుతున్నాయి.

రాజకీయ పార్టీల హడావుడి

స్థానిక సంస్థల ఎన్నికలు జులైలో జరుగుతాయన్న సమాచారంతో అధికార పార్టీ హడావుడి కనిపిస్తుంది. మరో పక్క స్థానిక సంస్థల్లో పట్టు సాధించాలని భావిస్తున్నారు. ఆరు గ్యారంటీల్లో ఎక్కువ భాగం అమలు చేయడంతో పాటు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, కుల గణన వంటి అంశాలు సానుకూల ప్రభావం చూపుతాయని కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నాయకత్వం భావిస్తోంది. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్‌గా పోటీ చేయాలని భావిస్తున్న ఆశావహులు సైతం ప్రజల్ని అంటిపెట్టుకునే కార్యక్రమాలు చేస్తున్నారు. రాజీవ్ యువ వికాసం, భూ భారతి, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు వంటి కార్యక్రమాల్లో కాంగ్రెస్ నేతల జోరు కనిపిస్తుంది. విపక్షమైన బీఆర్‌ఎస్ సైతం ఆరుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ స్థానమున్నందున పట్టు నిలుపుకోవాలని చూస్తుంది. ప్రజా సమస్యలపై పని చేస్తున్నారు. స్థానిక సంస్థల్లో మాజీ ప్రజా ప్రతినిధులంతా యాక్టీవ్ రోల్ ప్లే చేస్తున్నారు. వామపక్షాలైన సీపీఐ(ఎం), సీపీఐ సైతం పట్టున్న చోట ప్రజా సమస్యలపై కేంద్రీకరించి పని చేస్తున్నాయి. బీజేపీ సైతం పోటీ చేసేందుకు సిద్ధమవుతోంది.

# లీగ్ మ్యాచ్ సెలక్ట్ కమిటీని కొనసాగించండి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లోని క్రికెట్ సెలక్షన్ కమిటీ, లీగ్ మ్యాచ్‌ల పర్యవేక్షణ కమిటీలను కొనసాగించాలని హైకోర్టు ఆదేశించింది. సుప్రీం కోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలోని సింగిల్ మెంబర్ కమిటీ నియమించిన క్రికెట్ సెలక్షన్ కమిటీలు, లీగ్ మ్యాచ్‌ల పర్యవేక్షణకు హైకోర్టు ఏర్పాటు చేసిన హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ నవీన్‌రావు సారథ్యంలోని సూపర్‌వైజరీ కమిటీలను కొనసాగించాలని చెప్పింది. తాము తిరిగి ఆదేశాలు జారీ చేసే వరకు ఆ కమిటీలను కొనసాగించాలని హెచ్‌సీఏను ఆదేశించింది. హెచ్‌సీఏ జనరల్‌బాడీ మీటింగ్ (ఏజీఎం)లో నిర్ణయాలు తీసుకునే వరకు ఆ కమిటీలను కొనసాగింపునకు ఉత్తర్వులు ఇవ్వాలని జై హనుమాన్ క్లబ్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి గురువారం మధ్యంతర ఆదేశాలిచ్చారు. 2025-26 కాలంలో నిర్వహించబోయే లీగ్ మ్యాచ్‌లను హెచ్‌సీఏ నిబంధనలు, సూపర్‌వైజరీ కమిటీ నివేదిక మేరకు వ్యవహరించేలా హెచ్‌సీఏను ఆదేశించాలని పిటిషనర్ న్యాయవాది వాదించారు. సెలక్షన్ కమిటీలను, సూపర్‌వైజరీ కమిటీలను తొలగిస్తే హెచ్‌సీఏ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోడానికి వీలుంటుందన్నారు. ఏజీఎంలో నిర్ణయాలు తీసుకునే వరకు ఆ కమిటీలను కొనసాగింపునకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.. వాదనల తర్వాత హైకోర్టు, హెచ్‌సీఏ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఆ కమిటీలను కొనసాగించాలని హెచ్‌సీఏను ఆదేశించింది. విచారణను ఈ నెల 11కి వాయిదా వేసింది.

బతుకమ్మ కుంట పనులు చేసేందుకు హైడ్రాకు అనుమతి

ముంపు నివారణ పనులు కొనసాగించొచ్చు

హైకోర్టు ఉత్తర్వులు

వర్షాకాలంలో వరద ముంపునకు గురికాకుండా బతుకమ్మకుంట పునరుద్ధరణలో భాగంగా అవసరమైన పనులను చేయడానికి హైడ్రాకు హైకోర్టు అనుమతినిచ్చింది. బతుకమ్మకుంట స్థలానికి సంబంధించి ప్రయివేటు వ్యక్తులు హక్కుల వివాదంపై సివిల్ కోర్టులో ఇంజంక్షన్ పిటిషన్ తేలేదాకా యథాతథస్థితిని కొనసాగించాలన్న గత ఉత్తర్వులను సవరించింది. హైదరాబాద్ బాగ్‌అంబర్‌పేట సర్వే నెం.563/1లోని 7 ఎకరాలకు సంబంధించిన స్థలంపై మే ఐదున ఇచ్చిన స్టేటస్‌కో ఉత్తర్వులను సవరించాలని కోరుతూ హైడ్రా వేసిన వ్యాజ్యంపై జస్టిస్ నగేశ్ భీమపాక, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టిలతో కూడిన వెకేషన్ బెంచ్ ఇటీవల విచారించింది. హైడ్రా తరపు అడ్వకేట్ కె. పవన్‌కుమార్ వాదిస్తూ, బతుకమ్మ కుంట పునరుద్ధరణ పనులను ప్రభుత్వం చేపడుతోందన్నారు. ఆక్రమణదారులు అక్రమంగా డంపింగ్ చేస్తూ చెరువును కబ్జా చేస్తున్నారన్నారు. ఎ.సుధాకర్‌రెడ్డి మరో ఆరుగురు బాగ్‌అంబర్‌పేటలోని ఏడెకరాల భూమిపై హక్కుల కోసం హైకోర్టును ఆశ్రయించగా సింగిల్ జడ్జి పిటిషన్ కొట్టివేశారన్నారు. తిరిగి అప్పీలు దాఖలు చేయగా హక్కులకు సంబంధించిన వివాదాలను హైకోర్టు తేల్చదనీ, సివిల్ కోర్టులో తేల్చుకోవాలనీ, అవసరమైతే ఇంజంక్షన్ ఉత్తర్వులు తెచ్చుకోవాలని డివిజన్ బెంచ్ ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీనిపై ప్రయివేటు వ్యక్తులు సివిల్ కోర్టులో సూట్ దాఖలు చేశారనీ, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారన్నారు. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి ఇంజంక్షన్ దరఖాస్తు తేలేదాకా యథాతథస్థితి కొనసాగించాలంటూ మే ఏడున మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

ప్రస్తుతం వర్షాకాలం వస్తోందనీ, ఇప్పుడు పనులు పూర్తిచేయకపోతే పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతాయనీ, మధ్యంతర ఉత్తర్వులను సవరించని పక్షంలో పూడ్చుకోలేని నష్టం వాటిల్లుతుందన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న ధర్మాసనం స్టేటస్ కో కొనసాగించాలనీ, అయితే వర్షాకాలంలో కాలనీలు ముంపునకు గురవుతాయన్న హైడ్రా వాదనను పరిగణనలోకి తీసుకుని ముంపు నివారణ పనులు చేపట్టడానికి అనుమతిస్తూ గత ఉత్తర్వులను సవరించింది.

# ఇథనాల్ పరిశ్రమను అనుమతించం: తెలంగాణ రైతు సంఘం



గద్వాల:అమృత్ తెలంగాణ: జోగులాంబ గద్వాల జిల్లాలోని రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామ శివారులో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ పరిశ్రమను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ డిమాండ్ చేశారు. అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన రైతులను తక్షణమే విడుదల చేయాలని.. వారిపై పెట్టిన కేసులు బేషరతుగా ఎత్తివేయాలని తమ ప్రకటనలో వారు డిమాండ్ చేశారు.

ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ 12 గ్రామాల ప్రజలు గత పది నెలలుగా ఆందోళన నిర్వహిస్తున్నారని పోతినేని, సాగర్ తమ ప్రకటనలో తెలిపారు. జనవరి, ఫిబవరిలో దాదాపు 20 రోజులపాటు రిలే నిరాహార దీక్షలు చేయడంతో పరిశ్రమను ఏర్పాటు చేయనివ్వము అని ప్రభుత్వం ద్వారా రైతులకు హామీ ఇవ్వడంతో దీక్షలు విరమించారని వారు గుర్తుచేశారు. కానీ కంపెనీ యాజమాన్యం జూన్ 2వ తేదీ అర్ధరాత్రి జేసీబీలు, కంటైనర్లు, ట్రిప్పర్లతో పాటు కూలీలను తీసుకొని రావడమే కావడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ ఆందోళన చెందారని అన్నారు రైతు సంఘం ప్రతినిధులు. తమను మోసం చేశారని ప్రజలు పెద్ద ఎత్తున బుధవారం పరిశ్రమ ఏర్పాటు చేసే ప్రాంతానికి నిరసన తెలిపేందుకు వెళ్లారు.

# శుభకార్యం లో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : రెవెన్యూ గార్డెన్ లొ జరిగిన యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు వివాహ వేడుకలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క, బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్, పాల్గొన్న తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి వారితోపాటు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతన్ రావు యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సాయి చరణ్ గౌడ్, మావల మావల మండల్ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, అసెంబ్లీ ఉపాధ్యక్షులు సామా రూపేష్ రెడ్డి, నలిమేల నవీన్ రెడ్డి,యువజన కాంగ్రెస్ టౌన్ ఉపాధ్యక్షులు రంజిత్ రెడ్డి



వెంకటేష్, కిరణ్ కృష్ణ సురేష్, గౌతమ్, విశాల్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు

# జై సింగ్ రాథోడ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి



రిమ్స్ డైరెక్టర్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న సుగుణక్క మరియు బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ జన్మదిన సందర్భంగా రిమ్స్ లో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెల్పిన పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క , తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి . వారితో పాటు మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్,

సీనియర్ నాయకులు నలిమేల నవీన్ రెడ్డి,సురేష్, షిండే, సావిన్ రెడ్డి,విశాల్, వెంకటేష్, గౌతమ్ గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఇప్పుడైనా రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన భూ భారతి చట్టం ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సును ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. పలువురు రైతులతో మాట్లాడారు. రెవెన్యూ సదస్సులకు వచ్చే రైతులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.. ఈ కార్యక్రమంలో అధికా రులు మహేష్ నాయకులు దయాకర్ వెంకన్న . ముకుంద.మల్లేష్ తదితరులు ఉన్నారు



# ఇందిరమ్మ ఇల్లు - పేదలకు అండ బోథ్ నియోజకవర్గం ఇన్చార్జి ఆడే గజేందర్



భూమి పూజ చేస్తున్న ఆడే గజేందర్

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : నేరడిగొండ మండలంలోని కుంటాల కె గ్రామంలో రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ , బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆడే వసంత్ మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యులు వచ్చి లబ్ధిదారుల ఇండ్ల పనులను ప్రారంభించారు తర్వాత వారు మాట్లాడుతూ పేదల అభివృద్దె ప్రభుత్వ లక్ష్యమని ఇల్లు లేనటువంటి పేద ప్రజలకు మరియు బడుగు బలహీన వర్గాలను అందరిని ప్రభుత్వ అదుకుంటుందని తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు పార్టీ శ్రేణులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు,యువకులు,పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయడం జరిగింది..

# రెవెన్యూ సదస్సులో దరఖాస్తుల వెల్లువ..

ముధోల్ : అమృత్ తెలంగాణ: మండలంలోని ఆయా గ్రామాలలో ఈ నెల 3వ తేదీ నుంచి రెవెన్యు సదస్సులు కొనసాగుతున్నాయి. అయితే గురువారం మండలంలోని ముద్గల్, వడ్తల్ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరిగాయి. దీంతో గ్రామాల్లోని రైతులు తమ సమస్యలను పరిష్కారం కై దరఖాస్తులు రెవెన్యూ అదికారులకు అందజేశారు. ముద్గల్ గ్రామంలో 46 దరఖాస్తులు రాగ వడ్తల్ గ్రామంలో 69 దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ తెలిపారు.

# సరైన శిక్షణ, వ్యాయామం ద్వారా జాగిలాలు ఆపద సమయంలో చక్కటి విధులు నిర్వర్తిస్తాయి.

జాగిలాలకు వ్యాయామం చేయిస్తూ ఆరోగ్యంగా ఉండేలా చూడాలి

జాగిలాలకు వేసవి ఉపశమనం కై ఈత కొలను ప్రారంభం

జిల్లాలో 8 జాగిలాలకు ప్రత్యేకంగా ఈత కొలను

విధులను నిర్వర్తించి ఈత కొలనులో సేద తీరనున్న జిల్లా జాగిలాలు.

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్







అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి జాగిలాలు వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్నీ కాపాడుకుంటూ ఉన్నప్పుడు విధుల నందు ఉత్తమ ప్రదర్శనను అందిస్తాయని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు జాగిలాల బృందానికి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఈతకొలను ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జాగిలాలు విధులు నిర్వర్తించి సేద తీరడానికి ఈ ఈతకోలను ఉపయోగపడుతుందని తెలిపారు. వేసవికాలంలో ఎండ తీవ్రతను తట్టుకోవడానికి వాటి ఆరోగ్యం దృష్ట ఈతకోలను ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అదే విధంగా అత్యవసర సమయాలలో నదులలో, వాగులలో తమను తాము కాపాడుకోవడానికి, ఇతరులను రక్షించడానికి జాగిలాలకు ప్రత్యేకంగా ఈత అవసరం ఎంతగానో ఉంటుందని, అలాంటి సందర్భంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మందస్తు జాగ్రత్తలతో ఈ ఈతకొలను ప్రారంభించి శిక్షణను అందజేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ఎనిమిది జాగిలాలు ఉండగా అందులో ఐదు పేలుడు పదార్థాలను కనుగొనే జాగిలాలు, రెండు నేరస్తులను పట్టుకునే విధంగా శిక్షణ పొందిన జాగిలాలు, మాదక ద్రవ్యాలను, గంజాయి లాంటి వాటిని కనుగొనడంలో ఉన్న ఒక జాగిలం అందుబాటులో ఉందని తెలిపారు. వీటన్నిటికీ ఈతకులను ఎంతగానో ఉపయోగపడుతుంది తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి సురేందర్ రావు, డీఎస్పీ పోతారం శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ డి వెంకటి, ఎన్ చంద్రశేఖర్, డాగ్ స్క్వాడ్ ఇంచార్జ పి రమేష్, సాయుధ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిరోజు గ్రామాలను సందర్శిస్తూ విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్.

బక్రీద్ పండుగ సందర్భంగా సిబ్బంది పోలీస్ స్టేషన్లలో అప్రమత్తమై ఉండాలి.

మండల పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పట్టిష్టమైన చర్యలు చేపట్టాలి.

పిప్పర్ వాడ చెక్పోస్ట్ ను పరిశీలించిన జిల్లా ఎస్పీ.

పోలీస్ స్టేషన్లో రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలి.

గంజాయి, పశువుల అక్రమ రవాణా, గ్యాంబ్లింగ్ లాంటి వాటిని అరికట్టాలి.

రానున్న గ్రామపంచాయతీ ఎలక్షన్లకు ప్రతి ఒక్క సిబ్బంది పూర్తి సంసిద్ధులై ఉండాలి

పోలీస్ స్టేషన్కు కేటాయించిన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ





టోల్ ప్లాజా వద్ద దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : మహారాష్ట్ర తో సరిహద్దుతో ఉన్న భీంపూర్ మండల పోలీస్ స్టేషన్ జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసే పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సరిహద్దులు ఎలాంటి ఆసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రానన్న బక్రీద్ పండగ పోలీస్ స్టేషన్లను అప్రమత్తమై ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జైనథ్ మండలం పిప్పర్ వాడ చెక్పోస్ట్ ను జిల్లా ఎస్పీ పరిశీలించడం జరిగింది. చెక్పోస్ట్ గుండా అక్రమంగా పశువుల రవాణా జరగకుండా నిరోధించాలని, 24 గంటలు వాహన తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. జిల్లాలో బక్రీద్ సందర్భంగా ఎనిమిది చెక్పోస్టులను ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. రానున్న గ్రామ పంచాయతీ ఎలక్షన్లకు ప్రతి ఒక్కరూ పూర్తి సంసిద్ధులై ఉండాలని తెలిపారు. గ్రామాలను సందర్శిస్తూ విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలి. గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఎలాంటి సమస్యలకైనా జిల్లా పోలీసు యంత్రాంగం డయల్ 100 ద్వారా అందుబాటులో ఉంటుందని తెలియజేయాలన్నారు. సైబర్ క్రైమ్ బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు, గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని తెలియజేయాలన్నారు. మహిళలు చిన్నపిల్లల రక్షణకై షీ టీం బృందాలు అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందజేస్తాయని తెలియజేయాలన్నారు. గ్రామాలలో గంజాయి, దేశి దారు, పశువుల అక్రమ రవాణా ఇసుక అక్రమ రవాణా లాంటివి జరగకుండా పటిష్టమైన గస్తీ నిర్వహిస్తూ అరికట్టాలని సూచించారు. విధులలో ఉన్న పోలీసు సిబ్బందికి ఆటంకపరిచే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ కేసులు నమోదు చేయాలని తెలిపారు. రాత్రి సమయాలలో ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా అనుమానితులను గుర్తించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో ఉండే రికార్డుల ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలన్నారు. తదుపరి పోలీస్ స్టేషన్లో నమోదైన కేసులు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్లో సిబ్బంది చేసే విధులు పట్ల క్రమశిక్షణ సమయపాలన తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తదుపరి పోలీస్ స్టేషన్ కి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ సిఐ డి సాయినాథ్, బీమ్పూర్ ఎస్సై బి పీర్ సింగ్ నాయక్, పోలీస్ స్టేషన్ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.



భీంపూర్ మండలం పోలీస్ స్టేషన్ తనిఖీ చేస్తున్న ఎస్పీ

# బడిబాట లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

పెద్దవంగర: అమృత్ తెలంగాణ: రేపటి నుంచి ఈనెల 19 వరకు జరిగే బడిబాట కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో వేణుమాధవ్, మండల విద్యాశాఖాధికారి బుధారపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో బడిబాట కార్యక్రమం పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశం మేరకు ఆరేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు బాలలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని, అదే ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమ లక్ష్యమన్నారు. చదువుకు దూరమైన పిల్లలందరినీ మళ్లీ బడిలో చేర్పించాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతను వివరిస్తూ ఇంటింటి ప్రచారం చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు సాధించిన ప్రగతిని తల్లిదండ్రులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో చిట్యాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు విజయ కుమార్, ఐసీడీసీ సూపర్ వైజర్ శోభ, సీసీ సుధాకర్, శ్రావణి, ఉప్పలయ్య, కవిరాజు, సీఆర్పీలు వేముల సంతోష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో విస్తృతంగా పర్యటించి భూ భారతి రెవెన్యు సదస్సులు, విత్తన, షాపులు, ఎరువుల గోదాం లను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా పాలనాధికారి రాజర్షి షా.





అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి గురువారం అదిలాబాద్ రూరల్ అర్లీ బి, లాండా సాంగ్వి, మావల మండలం సరస్వతి నగర్ , చందటి, తంతోలి లలో రెవెన్యు సదస్సులు, విత్తన షాపులను. ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మొదటగా అదిలాబాద్ రూరల్ ఆర్లి బి గ్రామ పంచాయితీ లో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యు సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న తీరును పరిశీలించి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, గ్రామస్తులు దరఖాస్తులు ఏ సమస్య పై పెట్టుకున్నారు, ఎప్పటికప్పుడు రిజిస్టర్ లో నమోదు చేస్తున్నది, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రెవెన్యూ గ్రామాలలో జరుగుతున్న సదస్సులను పరిశీలించి, మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి భూ సమస్యలు పరిష్కారానికి రైతులకు సులభతరమైన విస్తృత సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన సదస్సులను జిల్లాలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలనీ, ఈ సదస్సులో సమస్యలు ఉన్న రైతులు, ప్రజలు వినియోగించుకోవాలనీ సూచించారు, ధరఖాస్తు కోసం వచ్చే వారికి కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు సమకూర్చాలని, హెల్ప్ డెస్క్ ద్వారా వారికి సహాయ సహకారాలు అందించాలని అన్నారు. రెండు బృందాలుగా రెవెన్యూ సిబ్బందిని నియమించి క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మావల మండలం సరస్వతి నగర్ ప్రాథమిక పాఠశాల లో ఏర్పాటు చేసిన రెవెన్యు సదస్సులు, అదిలాబాద్ గ్రామీణ తంతోలి లలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యు సదస్సులను సందర్శించి అధికారులు స్వీకరిస్తున్న దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించి పలు సూచనలు సలహాలు చేశారు . ఆర్లి బి లక్ష్మి ప్రసన్న ఫర్టిలైజర్ షాప్, బెల్లూరి శ్రీ బాలాజీ ఫెర్టిల్సైజర్స్ సీడ్స్ షాపు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం లో ఉన్న ఎరువులను తనిఖీ చేశారు ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువులు, రైతులకు విక్రయిస్తున్న తీరును, రిజిస్టర్ నిర్వహణ పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందనీ, మోసపూరితంగా విత్తనాలు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు పెట్టడం జరుగుతున్నదని స్పష్టం చేశారు. విత్తనాల సరఫరా, నాణ్యత, నియంత్రణ కోసం ప్రమాణాలు, ధరల పట్టికలు పరిశీలించారు. కలెక్టర్ వెంట తహిసిల్దార్ గోవింద్, మండల వ్యవసాయ అధికారి, తదితరులు ఉన్నారు.

# నకిలీ ఇంటి నంబర్, దస్తవీజులు, పత్రాలను సృష్టించి షాపును, స్థలాన్ని కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న నిందితులు అరెస్టు - ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి.

ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో ఐదుగురిపై కేసు నమోదు ముగ్గురి అరెస్ట్, రిమాండ్ కు తరలింపు. కిరాయి ఉంటూ నకిలీ లీజు డాక్యుమెంట్లు సృష్టించి, డాక్యుమెంట్ రైటర్ సహాయంతో కావాలనే రిజిస్ట్రేషన్ చేసుకున్న నిందితులు. లింక్ డాక్యుమెంట్లు లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవద్దు అని సూచన. సరైన పత్రాలు సరి చూసుకున్న తర్వాతనే భూములను షాపులను కొనాలి. డాక్యుమెంట్ రైటర్లు, రిజిస్ట్రేషన్ అధికారులు రిజిస్ట్రేషన్ చేసుకునే ముందు డాక్యుమెంట్లు సరి చూడాలని మనవి. ప్రభుత్వ ప్రైవేటు భూములను, దుకాణాలను నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసే నిందితుల పట్ల కఠినంగా వ్యవహరించనున్న జిల్లా పోలీసు యంత్రాంగం.

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి: పట్టణంలోని గణేష్ టాకీస్ పక్కన ఉన్న ఒక షాప్ యజమాని ఈ బుచ్చమ్మ, హౌస్ నెంబర్ 6-6-2/1. ఈ దుకాణాన్ని కబ్జా చేయాలనే దురుద్దేశంతో A1-సయ్యద్ జహీరుద్దీన్(అరెస్టు) కిరాయితో ఉంటూ నకిలీ లీజు డాక్యుమెంటు సృష్టించడం జరిగింది. ఈ నకిలీ లీజు డాక్యుమెంట్ ఆధారంగా మున్సిపాలిటీలో ఒక ఫేక్ డోర్ నెంబర్ ను తీసుకొని దాని ద్వారా, పట్టణంలో ఎంతో సీనియారిటీ ఉన్న డాక్యుమెంట్ రైటర్ A- 5 ఫైజుద్దీన్ సిద్ధికి ఏ సాహెర్ భాయ్(అరెస్టు) తాను షాపును కాజేయాలనే దురుద్దేశంతో షాపు వివాదంలో ఉన్నదని తెలిసిన తన కొడుకు మరియు ఇతరుల పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగింది. ఈ పత్రాలు ఆధారంగా షాపును కబ్జా చేసి నిజమైన వారసులకు దుకాణాన్ని ఇవ్వకుండా ఉన్నారు. దుకాణం నకిలీ నంబర్ను కేటాయించిన దానిపై మున్సిపాలిటీ నందు ఫిర్యాదు చేయగా మున్సిపాలిటీ కమిషనర్ విచారణ జరిపి కేటాయించిన నెంబర్ను రద్దు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సంఘటనలో నిజం తెలిసి కావాలనే రిజిస్ట్రేషన్ చేసుకుని కబ్జా చేసిన

A2 మహమ్మద్ సోహెబ్ S/O ఫైజుద్దీన్ సిద్ధికి(అరెస్ట్) ,

A3 ఎస్తేర్ హుస్సేన్(పరారీ),A4 షేక్ అబిద్ షేక్ నూర్(పరారీ) లపై ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగింది అని తెలిపారు. నకిలీ దాస్రావీజులు, నకిలీ హౌస్ నంబర్ల ఆధారంగా ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసుకోవడం చట్టరీత్యా నేరమని తెలిపారు. డాక్యుమెంట్ రైటర్లు రిజిస్ట్రేషన్ అధికారులు లింక్ డాక్యుమెంట్లు లేకుండా రిజిస్ట్రేషన్ చేయవద్దని సూచించారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి హెచ్చరించారు.




జీవన్ రెడ్డి డి.ఎస్.పి అదిలాబాద్

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



చెట్టుకు నీరు పోస్తున్న జిల్లా పాలన అధికారి అభిలాష అభినవ్



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చెట్లు మనకు నీడను, ఆక్సిజన్ను అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడతాయి. వాటిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు ఆక్సిజన్ కొరకు పోరాడే దుస్థితి ఏర్పడుతుందని అన్నారు. కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని, ప్రతి ఒక్కరూ తమ జన్మదినాలు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటర్ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు సన్మానం



సన్మానిస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : అదిలాబాద్ జిల్లా ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఫిరోజ్ ఖాన్ ప్రధాన కార్యదర్శి కె నరేష్ కుమార్ లకు తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సంఘం జిల్లా అధ్యక్షులు బండారి కృష్ణ ప్రధాన కార్యదర్శి రఘురాం గౌరవ అధ్యక్షులు బ్రహ్మానందం రెడ్డి, హరీష్, నగేష్ ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల ఎడిటర్ సంఘం జిల్లా అధ్యక్షులుగా నియమితులైన ఫిరోజ్ ఖాన్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కే నరేష్ కుమార్ లను గురువారం తెలంగాణ మెడికల్ హెల్త్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బండారి కృష్ణ మాట్లాడుతూ ఎడిటర్ సంఘం జిల్లా కమిటీ లో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎంపికైనఫిరోజ్ఖాన్కెనరేష్ కుమార్లను సన్మానించడం జరిగిందని తెలిపారు రాబోయే రోజుల్లో కూడా వీరు అనేక పదవులు రాష్ట్రస్థాయిలో కూడా పొందాలని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# డా. వివేక్ గ్యాస్ట్రో ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆత్రం సుగుణక్క బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో డా. వివేక్ గ్యాస్ట్రో ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంటు ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి వైద్య సిబ్బంది స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం సుగుణక్క మాట్లాడుతూ పేదలు, మధ్యతరగతి వారిని దృష్టిలో ఉంచుకొని రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని, సేవా దృక్పథంతో సేవలందించాలని తెలియజేశారు. వైద్యో నారాయణి హరి అంటారని, కనిపించే డాక్టర్లే దేవుళ్ళతో సమానమని, వారికి రోగులు, కుటుంబ సభ్యులు సహకరించాలని పేర్కొన్నారు.

ఆస్పత్రిలో మరిన్ని సేవలు అందుబాటులోకి తెచ్చి అంచలంచలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూసమస్యల పరిష్కారానికి భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులు: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి ప్రజల భూ సంబంధిత సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. గురువారం మామడ మండలంలోని ఆరేపల్లి గ్రామంలో నిర్వహించిన భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి చట్టాన్ని రూపొందించి అమలులోకి తెచ్చిందని తెలిపారు. కుంటాల మండలంలో ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద సదస్సులు విజయవంతంగా నిర్వహించామని, ఇప్పుడు రెండో విడత భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులు ఈనెల 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో నిర్వర్తించబోతున్నామని చెప్పారు. గ్రామ రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు తమ భూ సమస్యలపై దరఖాస్తులు సమర్పించి పరిష్కారం పొందవచ్చని తెలిపారు. సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను అధికారులు సక్రమంగా రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, తహసిల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు వహించాలి: డీఎంహెచ్వో

బజార్ హత్నూర్: అమృత్ తెలంగాణ: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తలు వహించాలని డీఎంహెచ్వో రాథోడ్ నరేందర్ సూచించారు. గురువారం మండలంలోని టెంబి గ్రామంలో వైద్య శిబిరాన్ని సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఇంటి చుట్టూ మురికి కాల్వల్లో నీటి నిల్వ ఉండడం వల్ల దోమలు అధికమవుతాయని, నీటి నిల్వ ఉన్నచోట శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. వర్షాకాలంలో బోర్లలో నీరు మారుతుందని, త్రాగునీరు విషయంలో జాగ్రత్తలు వహించాలన్నారు. వైద్య శిబిరం ప్రక్రియను ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు అలేఖ్య, వైద్య సిబ్బంది దివ్య, సుశీల, రాణి, రవీందర్, అభిషేక్, రవి, గాజుల రమేష్, విజయ, మంజుల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా పర్యావరణ దినోత్సవం..



ముధోల్ :అమృత్ తెలంగాణ: ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా మండలంలోని విట్టోలి గ్రామంలో గురువారం ఎంపీడీవో శివకుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ పరిరక్షణ కై మన వంతు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఎంపీడీవో శివకుమార్ అన్నారు. ప్లాస్టిక్ ను నిర్మూలించి ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దు కుందామని అవగాహన కల్పించారు. అలాగే మండల కేంద్రమైన ముదోల్ లో అమృత్ ఆరోవర్ వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శిరీష రెడ్డి, ఉపాధి సిబ్బంది పంచాయతీ కార్యదర్శిలు అనూష, తదితరులున్నారు.

# ప్లాస్టిక్ నివారిద్దాం ప్రకృతిని పరిరక్షిద్దాం




నీలాకాశాన్ని చూస్తూ ఒక్కసారి ప్రశాంతంగా ఊపిరి పీల్చి వదలాలని ఎవరికి ఉండదు? కానీ అలా పీల్చినప్పుడు గాలి వాసన తెలియకపోతే..! సెలయేర్లలో, నదులలో, పారే నీరు ఇంకిపోయి, గలగల పారే శబ్దం వినిపించకపోతే.. అడవి పరిమళం గుండెలను తాకకపోతే.. జీవితానికి అర్థం ఉంటుందా? ప్రకృతి మన జీవితానికి ఊపిరిలాంటిది. పచ్చదనం లేకపోతే మన ఊపిరి ఆగడం ఖాయం. గాలిలో తేమ లేకపోతే జీవం ఉండదు. పచ్చని చెట్టు నీడ లేకపోతే మనిషి మనుగడ లేదు. ప్రకృతిని కాపాడుకోవాలనే తపన నుండే పర్యావరణ దినోత్సవం ఆవిర్భవించింది. ప్రతి సంవత్సరం జూన్ ఐదును పర్యావరణ దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఉత్సవం అంటే ఇదొక వేడుక కాదు! ఒక బాధ్యత! ప్రపంచ మానవాళి సమిష్టి బాధ్యత! నిజానికి ఇదొక మేల్కొలుపు! ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఓ అత్యవసరమైన సమస్యపై దృష్టి పెట్టింది. అదే ప్లాస్టిక్ భూతంతో యుద్ధం! ప్రపంచవ్యాప్తంగా ప్లాస్లిక్ కాలుష్యాన్ని అంతం చేయడం లక్ష్యంగా ఈ ఏడాది పర్యావరణ దినోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక కథనం.

ఒంటరి పోరాటం చేయడం ప్రకృతికి కొత్తకాదు. కానీ, ఆ పోరాటంలో అలిసిపోయింది. సర్వాంతర్యామిగా మారిన ప్లాస్టిక్ ప్రకృతి ఊపిరి తీస్తోంది. ఇప్పుడు మనం తీసుకునే చిన్న చిన్న నిర్ణయాలే పర్యావరణాన్ని కాపాడతాయి, ప్రకృతికి ప్రాణం పోస్తాయి. మానవాళికి పరిమళాలతో నిండిన ఊపిరినిస్తాయి.

స్టాకహోమ్‌లో 1972లో జరిగిన హ్యూమన్ ఎన్విరాన్‌మెంట్ కాన్ఫరెన్స్‌లో ఈ దినోత్సవాన్ని ప్రారంభించారు. అప్పటి నుండి ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణకు అవగాహన పెంచేందుకు, అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఇది ఒక ప్రధాన వేదికగా మారింది. 150కి పైగా దేశాలు దీనిలో భాగస్వామ్యమయ్యాయి. ప్రతి ఏడాది ఒక్కో ప్రధానమైన అంశాన్ని థీమ్‌గా ప్రకటించి, ఆ సమస్య పరిష్కారానికి, దానిపై ప్రజలను చైతన్యపరచడానికి ఆ సంవత్సరమంతా కృషి చేస్తారు. ప్రతి ఏడాది జూన్ 5న ప్రారంభమయ్యే ఈ కృషి ఆ ఏడాదంతా సాగుతుంది. దానిలో భాగంగానే ఈ ఏడాది ప్లాస్టిక్‌తో పర్యావరణానికి కలుగుతున్న ముప్పును థీమ్‌గా ఎంచుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 43 కోట్ల టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తవుతోంది. వీటిలో మూడవ వంతు మాత్రమే పునర్ వినియోగం (రీ సైకిల్) అవుతుంది. మిగతావన్నీ సముద్రాలలోకి, నేలల్లోకి, గాలిలోకి చేరి మన ఆరోగ్యాన్ని, జీవవైవిధ్యాన్ని నశింపజేస్తున్నాయి. మైక్రోప్లాస్టిక్స్ రూపంలో మన శరీరాల్లోకి చొరబడుతున్నాయి. మానవాళికి మరణ శాసనం రాస్తున్నాయి.

## నిషేధం సాధ్యమేనా..?

మానవాళితో పాటు భూమి మీద సమస్త జీవరాశి భవిష్యత్‌ను ఇది సవాల్ చేస్తోంది. అదే సమయంలో మానవాళి నిత్య జీవితంలో అంతగా ముడిపడిపోయింది కూడా! ప్లాస్టిక్ లేని జీవితాన్ని ఊహించడం అసాధ్యంగా మారింది. అంతేకాదు, దేశాల ఆర్థిక వ్యవస్థలను శాసించే స్థాయికి ప్లాస్టిక్ చేరింది. ప్లాస్టిక్ పరిశ్రమల మీద ఆధారపడి పొట్టపోసుకుంటున్న వారి సంఖ్య ప్రతి ఏడాది ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోంది. పెట్రోలియం ఉప ఉత్పత్తియైన దీని నుండి కార్పొరేట్లు పోగుచేసుకునే లాభాల గురించి ప్రత్యేకంగా చెప్పనవపసరం లేదు. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఒట్టావాలో గత ఏడాది మే నెలలో ప్లాస్టిక్ వినియోగంపై జరిగిన అంతర్జాతీయ సదస్సు విఫలమవ్వడానికి ఇవన్నీ కారణాలే! 192 దేశాలకు చెందిన ప్రతినిధులు వారం రోజుల పాటు సమావేశమై సుదీర్ఘంగా జరిపిన చర్చల్లో ప్లాస్టిక్ నిషేధం గురించి కాదు కదా, ఉత్పత్తులపై పరిమితంగా ఆంక్షలు విధించే విషయంలోనూ ఏకాభిప్రాయం కుదరలేదు. చివరిరోజు సమావేశాన్ని అర్ధరాత్రి వరకు పొడిగించినా ఫలితం శూన్యం. ప్లాస్టిక్ మానవాళికి ప్రమాదకరంగా మారిందని, భూ తాపం పెరగడానికి ప్లాస్టిక్ కూడ కారణమవుతోందనే అంశాలపై అత్యధిక దేశాలు ఏకాభిప్రాయానికి రావడమే ఈ సమావేశంలో లభించిన కొంత ఊరట! దీనినే చర్చల్లో స్వల్ప పురోగతిగా ఐక్యరాజ్యసమితి చెబుతోంది. ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించడం, దాని వినియోగాన్ని పూర్తిస్థాయిలో నిలిపివేయడానికి కాలవ్యవధిని నిర్ణయించడం లక్ష్యాలుగా 2022లో ఈ చర్చల ప్రక్రియ ప్రారంభమైంది. ఆ పరంపరంలో నాల్గవ విడత చర్చలు ఒట్టవాలో జరిగాయి. దీనికి ముందు జరిగిన చర్చలదీ ఇదే పరిస్థితి. ఈ ఏడాది ఆగస్టు నెలలో జెనీవాలో మరో దఫా చర్చలు జరగనున్నాయి.

## ఆటంకం ఎవరు?

ధనిక దేశాలు, పెట్రోలియం ఉత్పత్తి చేసే దేశాలు వాతావరణ చర్చల తరహాలోనే ప్లాస్టిక్ చర్చల్లోనూ పురోగతికి మోకాలడ్డుతున్నాయి. పూర్తిస్థాయిలో వినియోగాన్ని నిలిపివేసే సంగతి అటుంచితే, ఉత్పత్తులపై స్వల్ప స్థాయిలో పరిమితులు విధించాలన్న ప్రతిపాదనలను సైతం ఆ దేశాలు తిరస్కరించాయి. ఈ తరహా చర్చల్లో చక్రం తిప్పే కార్పొరేట్ సంస్థలదీ ఇదే వైఖరి! దీంతో ఎన్ని దఫాలు కొనసాగినా చర్చల్లో పురోగతి లేని స్థితి నెలకొంది. ప్లాస్టిక్ వ్యర్థాలు, వాటి నిర్వహణ, పారదర్శకత, ట్రాకింగ్, పర్యవేక్షణ, లేబిలింగ్, నాన్ ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలు, పాలిమర్లు, వాటి ఉత్పత్తుల వ్యాపారం, ప్రమాదకరం కాని రీతిలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, సముద్ర పర్యావరణంపై ప్లాస్టిక్ ప్రభావం తదితర అంశాలను చర్చించడానికి కూడా ధనిక, పెట్రోలియం ఉత్పత్తి దేశాలు ఒట్టావా సదస్సులో సిద్ధపడలేదు. అమెరికా ఈ సదస్సుకు హాజరుకాలేదు. హాజరైన సౌదీ అరేబియా, రష్యా, ఇరాన్, కువైట్, యుఎఇ వంటి దేశాలు ప్లాస్టిక్ నిషేధానికి తీవ్ర అభ్యంతరాలు తెలిపాయి.

భారత్, చైనా కూడా కొన్ని అంశాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. భారతదేశం ప్రాథమిక ప్లాస్టిక్ పాలిమర్లు, వర్జిన్ ప్లాస్టిక్‌లపై విధించే నిషేధం, నియంత్రణలను వ్యతిరేకిస్తామని ప్రకటించింది. రసాయనాలకు సంబంధించిన నిబంధనలు శాస్త్రబద్ధంగా, పారదర్శకంగా ఉండాలని వాదించింది. ప్లాస్టిక్ వినియోగానికి సంబంధించి తమ దేశంలో ఇప్పటికే కొన్ని నియంత్రణ చర్యలను చైనా అమలుచేస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందుతున్న దేశాలు, వాటి ఆర్థిక వాస్తవికత పరిస్థితులను దృష్టిలో పెట్టుకోవాలని వాదిస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, రీ సైక్లింగ్ సామర్థ్యాల పెంపుకు సంబంధించిన సాంకేతికతలను అభివృద్ధి చెందిన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలతో పంచుకోవాలని చెబుతోంది.

## ఎందరు కార్మికులు ..?

ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్లాస్టిక్ పరిశ్రమపై ఆధారపడి పొట్టపోసుకుంటున్న కార్మికులు ఉన్నారు. చైనా, యూరోపియన్ యూనియన్, అమెరికాల్లో వీరి సంఖ్య భారీగా ఉంది. అయితే, వాస్తవ వివరాలను ఆ దేశాలు వెల్లడించడం లేదు. మన దేశంలోనే 2019 నాటి గణాంకాల ప్రకారం 40 లక్షల మందికి ప్లాస్టిక్ పరిశ్రమ ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తోంది. 2023 సంవత్సారాంతానికి ఈ సంఖ్య రెట్టింపై ఉంటుందని అంచనా! పరోక్షంగా కోట్లాదిమంది ఆధారపడి ఉన్నారు. ప్లాస్టిక్‌పై నిషేధం విధిస్తే వీరందరికి ప్రత్యామ్నాయం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

## ఐదు ఆర్‌లతో దక్షిణ కొరియా

ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి దక్షిణ కొరియా ఆతిథ్యం ఇస్తోంది. ఆ దేశంలోని జేజు ప్రావిన్స్‌లో ఈ వేడుకలు జరగనున్నాయి. 1997లో కూడా దక్షిణ కొరియా పర్యావరణ దినోత్సవానికి ఆతిథ్యమిచ్చింది. తాజాగా ప్లాస్టిక్ రహిత భూగోళం నినాదాన్ని సాకారం చేయడమే లక్ష్యంగా ఈ ఉత్సవాలకు ఆతిథ్యమిస్తున్నట్లు దక్షిణ కొరియా ప్రకటించింది. దీనికోసం ఐదు 'ఆర్'ల కార్యక్రమాన్ని ఆ దేశం ప్రకటించింది. అవి  అవి (ప్లాస్టిక్ వాడకాన్ని తిరస్కరించు)బీ  అవి (తప్పనిసరిగా వాడాల్సి వస్తే తగ్గించు)బీ  అవి (వాడిన దానినే మళ్ళీ, మళ్లీ వాడు)బీ  అవి (వాడిన దానిని పారవేయకుండా ముడిపదార్థంగా మార్చి కొత్త ఉత్పత్తిని తయారుచేయి)బీ (మీరు ప్లాస్టిక్ వాడటానికే ముందే ఒకటికి, రెండు సార్లు ఆలోచించండి) ఈ ఐదు ఆర్‌లను విస్త ృతంగా ప్రచారం చేయడం ద్వారా ప్లాస్టిక్ వాడకాన్ని గణనీయంగా తగ్గించాలని దక్షిణకొరియా భావిస్తోంది..

## 1972లోనే ఎందుకు?

పర్యావరణం మీద చర్చించాలన్న ఆలోచన1972లోనే ఎందుకొచ్చింది. ఆ సమావేశానికి ఎవరు చొరవ చూపారు. తొలి సమావేశంలో భారతదేశ పాత్ర ఏమిటి? ఈ ప్రశ్నలకు జవాబులు తెలుసుకోవడం ఆసక్తికరంగా ఉంటుంది కదూ!

ఇవీ కారణాలు!

నిజానికి 1960వ దశకంలోనే ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ సమస్యలు తీవ్రమయ్యాయి.

పారిశ్రామికీకరణ కారణంగా ప్రకృతి వనరుల విధ్వంసం సాగింది.

వాయు కాలుష్యం పెరిగింది. నదులు, సముద్రాలు వ్యర్థాలతో కలుషితం కావడం ప్రారంభమైంది.

అనేక నగరాల్లో పొగమంచు వల్ల శ్వాస సమస్యలు తలెత్తాయి.

అమెరికా యూరప్‌లో వీటి ప్రభావం తీవ్రంగా కనిపించింది.

చొరవ చూపింది ఎవరు?

స్వీడన్ ప్రభుత్వం మొదట చొరవ చూపింది.

1970లోనే ఐక్యరాజ్యసమితిని సంప్రదించింది.

పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ప్రతిపాదించింది.

పర్యావరణ సమస్యల ప్రభావంతో పాటు ప్రజల్లో పెద్దఎత్తున చర్చ జరగడం స్వీడన్ చొరవకు కారణం.

మద్దతు ఇలా..

ఈ ప్రయత్నానికి కెనడాకు చెందిన మౌరిన్ స్ట్రాంగ్ అనే పర్యావరణవేత్త గట్టిగా మద్దతు ఇచ్చారు.

స్టాకహోమ్ కాన్ఫరెన్స్‌కు ప్రధానకార్యదర్శిగా వ్యవహరించారు.

ఆయన కృషి వల్ల 113 దేశాలు ఈ సదస్సులో పాల్గొన్నాయి.

26 అంశాలతో డిక్లరేషన్ ప్రకటించారు.

ఐక్యరాజ్యమితి పర్యావరణ కార్యక్రమం
రూపొందింది. దానికి మొదటి డైరక్టర్‌గా
మౌరిన్ స్ట్రాంగ్ నియమితులయ్యారు.

భారత్‌పై ప్రభావం..

1974లో వాటర్ యాక్ట్, 1981లో ఎయిర్ యాక్ట్ రూపకల్పన.

పర్యావరణ మంత్రిత్వశాఖ ఏర్పాటు

1976లో రాజ్యాంగంలోని 42వ సవరణ ద్వారా పర్యావరణ పరిరక్షణను రాజ్యాంగ హక్కుగా గుర్తించారు.

మనదేశం పాత్ర..

ప్రధానమంత్రి హోదాలో ఇందిరాగాంధీ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె చేసిన ప్రసంగం ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది.

అభివృద్ధి–పేదరిక నిర్మూలనకు మధ్య సమతుల్యత సాధించడానికి పర్యావరణ పరిరక్షణ వేదిక కావాలని ఆమె అన్నారు.

అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని పరిస్థితులను గౌరవించాలని సూచించారు.

కాలుష్యం యొక్క అత్యంత ఘోరమైన రూపమే పేదరికం! (పావర్టి ఈజ్ ది వరస్ట్ ఫామ్ ఆఫ్ ది పొల్యూషన్) అని ఇందిర వ్యాఖ్యానించారు.

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 43 కోట్ల టన్నుల కంటే ఎక్కువ ప్లాస్టిక్ ఉత్పత్తవుతోంది.

ఈ ప్లాస్టిక్‌లో సుమారు 50% సింగిల్–యూజ్ ప్లాస్టిక్. (ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్)

ప్రతి సంవత్సరం 88 లక్షల టన్నుల కంటే ఎక్కువ ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాల్లోకి చేరుతున్నాయి.

2013 నాటి గణాంకాల ప్రకారం 8.6 కోట్ల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రపు అడుగున పేరుకుపోయి ఉన్నాయి.

ఇవి 1950 నుండి 2013 వరకు జరిగిన ఉత్పత్తిలో 1.4 శాతం మాత్రమే.

ఇవి సముద్ర జీవులకు ప్రాణహానిని కలిగిస్తున్నాయి.

ప్రపంచంలో తయారైన మొత్తం ప్లాస్టిక్‌లో 9% మాత్రమే రీసైకిల్ అవుతోంది.

# ఏంటి జాన్వి ఫన్ కోసమే అలా చేస్తుందా..?



బాలీవుడ్ స్టార్ తనయ జాన్వి కపూర్ సినిమాతో ఈక్వల్ గా సోషల్ మీడియాలో తన పాపులారిటీ చూపిస్తుంది. సినిమాల లెక్క ఎలా ఉన్నా సరే సోషల్ మీడియా క్రేజ్ తోనే ఆమె అదరగొట్టేస్తుంది. అయితే జాన్వి మాత్రం రివర్స్ లో తను సోషల్ మీడియాని అసలు పట్టించుకోనని అంటుంది. జాన్వి కపూర్ ఇన్ స్టాగ్రాం లో 20 మిల్లియన్లకు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. వారిని అలరించేందుకే రకరకాల ఫోటో షూట్స్ చేస్తుందేమో అనుకుంటే అసలు తను సోషల్ మీడియాని పట్టించుకోను.. తను కేవలం ఫన్ కోసమే ఫోటోలని సోషల్ మీడియాలో షేర్ చేస్తానని అంటుంది. గ్లామర్ ట్రీట్ తో ఫాలోవర్స్ ని వెర్రి వాళ్లని చేస్తున్న జాన్వి ఈ ఫోటోలు కేవలం ఫన్ కోసమే అంటూ చెప్పి షాక్ ఇచ్చింది. తను ఎంత సరదాగా ఫోటోలు షేర్ చేసినా ఫాలోవర్స్ మాత్రం వాటిని చాలా సీరియస్ గా ఫాలో అవుతున్నారు. జాన్వి ప్రతి ఫోటో షూట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ వస్తున్నాయి. గ్లామర్ ఎటాక్ లో జాన్వి తన ప్రత్యేకతని చూపిస్తుంది. స్టార్ కూతురు అయ్యుండి ఇలా రెచ్చిపోతే నెటిజెన్లు దారుణంగా కామెంట్స్ చేస్తారని తెలిసినా తను అనుకున్నది చేయడంలో వెనక్కి తగ్గట్లేదు జాన్వి కపూర్. అయితే ఈ ఫోటోలు అంతా కూడా తను కావాలని కాకుండా చాలా సరదాగానే షేర్ చేస్తున్నా అని చెప్పుకొచ్చింది. రీసెంట్ గా మిలి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన జాన్వి ఆ సినిమా ఫలితం ఎలా ఉన్నా ఆమె నటనకు మంచి మార్కులు కొట్టేసింది. ఇక సౌత్ సినిమాల మీద జాన్వి ప్రత్యేక ఆసక్తి చూపిస్తుంది. ఛాన్స్ వస్తే తెలుగు సినిమాలో చేయాలని అనుకుంటుంది అమ్మడు. ఇక్కడ ఎన్.టి.ఆర్ తో జత కట్టాలని జాన్వి ఇంట్రెస్ట్ చూపిస్తుంది. సినిమాల్లో కన్నా జాన్వి తన ఫోటో షూట్స్ లోనే తన అందాలకు పని చెబుతుంది. గ్లామర్ షో విషయంలో తనకంటూ ఒక పర్ఫెక్ట్ స్కెచ్ ఉన్నట్టుగా జాన్వి మాటలని బట్టి అర్థమవుతుంది. రోజు రోజుకి తన స్కిన్ తోనే ఫాలోవర్స్ ని తన బుట్టలో పడేసుకుంటున్న అమ్మడు సినిమా ఫలితాలతో సంబంధం లేకుండా తన క్రేజ్ కొనసాగిస్తుంది.

# టాలీవుడ్‌పై చాలా ఆశలు పెట్టుకుంది..!



ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తాను టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌ను అని, తనకు తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి అధికంగా ఆఫర్లు వస్తున్నాయని చెప్పుకొచ్చింది. మెగాస్టార్ చిరంజీవితో 'వాల్తేరు వీరయ్య' సినిమాలో బాస్ పార్టీ, బాలకృష్ణతో 'డాకు మహారాజ్' సినిమాలో దబిడి దిబిడి సాంగ్ చేయడం ద్వారా టాలీవుడ్‌లో మోస్ట్ పాపులర్ ఐటెం సాంగ్ హీరోయిన్‌గా ఊర్వశి రౌతేలా నిలిచింది. ప్రస్తుతం టాలీవుడ్‌లో స్టార్ హీరోల సినిమాల్లో ఐటెం సాంగ్ అనగానే ఈ అమ్మడి పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఊర్వశి రౌతేలా మాస్ ఐటెం సాంగ్స్‌కి మంచి స్పందన వచ్చింది. ఇప్పటి వరకు తెలుగులో ఈమె చేసిన దాదాపు అన్ని సాంగ్స్ మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఎక్కువ ఆఫర్లు వస్తున్నాయి. పైగా హీరోయిన్స్ రేంజ్‌లో ఈమె పారితోషికంను అందుకోవడం కూడా కలిసి వచ్చే అంశంగా చెప్పుకోవచ్చు. పారితోషికం భారీగా దక్కుతున్న నేపథ్యంలో టాలీవుడ్‌లో ఐటెం సాంగ్స్ చేసేందుకు ఈమె చాలా ఆసక్తిగా ఉంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తాను టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌ను అని, తనకు తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి అధికంగా ఆఫర్లు వస్తున్నాయని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం టాలీవుడ్‌లో తాను బిజీ స్టార్ అన్నట్లుగా జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన గొప్ప తాను తెగ చెప్పుకుంది. చాలా మంది దర్శకులు నన్ను సంప్రదించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి సినిమాల్లో నన్ను నటింపజేసేందుకు పోటీ పడుతున్నారంటూ కాస్త అతిగా వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం ఊర్వశి రౌతేలా చేసిన ఈ వ్యాఖ్యల గురించి ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది. 60 డేస్ ప్లాన్! డాకు మహారాజ్ తర్వాత ఊర్వశి కొత్త సినిమాలతో వచ్చిందే లేదు. బ్లాక్ రోజ్ అనే సినిమాలో నటిస్తుంది. కానీ అది ఎప్పటికీ వస్తుంది అనే విషయమై క్లారిటీ లేదు. అయినా కూడా ఈ అమ్మడు టాలీవుడ్‌లో తనకు వచ్చే అవకాశాల గురించి, ముందు ముందు చేయబోతున్న సినిమాల గురించి చాలానే ఆశలు పెట్టుకుని ఉంది. హిందీలో ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తున్నప్పటికీ టాలీవుడ్ పైనే ఈమెకి మోజు ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఐటెం సాంగ్స్ స్పెషలిస్ట్‌గా పేరు దక్కించుకున్న ఈ అమ్మడు హీరోయిన్‌గానూ ఆఫర్లు వస్తాయేమో అనే నమ్మకంతో కనిపిస్తుంది. ముందు ముందు ఈ అమ్మడి జోరు ఏ రేంజ్‌లో ఉంటుందో చూడాలి. 2013లో సింగ్ సాబ్ ది గ్రేట్ అనే సినిమాతో బాలీవుడ్‌లో అడుగు పెట్టిన ఈ అమ్మడు దశాబ్ద కాలంలోనే అత్యధిక సినిమాల్లో నటించి మెప్పించింది. పలు సినిమాల్లో గెస్ట్ అప్పియరెన్స్, ప్రత్యేక సాంగ్స్ చేయడం ద్వారా కూడా మరింతగా పాపులారిటీని సొంతం చేసుకుంది. తమిళ్‌లో ఈమె ది లెజెండ్ అనే సినిమాలో ముఖ్య పాత్రలో నటించింది. ఆ తర్వాత తమిళ్ నుంచి ఆఫర్లు వచ్చినా కొన్ని కారణాల వల్ల తిరస్కరించినట్లు సమాచారం అందుతోంది. మొత్తానికి ఊర్వశి రౌతేలా హిందీ, తమిళ్, తెలుగు, బెంగాలీ భాషల్లోనూ నటించడం ద్వారా పాపులారిటీ సొంతం చేసుకుంది. కానీ ప్రస్తుతం ఈమెకు ఉన్న క్రేజ్ నేపథ్యంలో తెలుగు సినిమాలను ఎక్కువ చేయాలని ఆశ పడుతోంది.

# మమితా బైజు డిమాండ్ బాగుంది..!



ఐతే ఎవరైనా హీరోయిన్ తెలుగులో కాస్త క్రేజ్ తెచ్చుకుంటే చాలు వాళ్లకి వరుస ఆఫర్లు వస్తాయి. ప్రేమలు సక్సెస్ తో మమితాకు అలాంటి ఆఫర్లు వచ్చాయి. ప్రేమలు సినిమాతో సౌత్ లో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది క్యూట్ బ్యూటీ మమితా బైజు. దాదాపు ఏడెనిమిది ఏళ్లుగా మళయాళంలో నటిస్తూ వచ్చిన మమితా బైజు అక్కడ ఒక మోస్తారు క్రేజ్ తో కెరీర్ కొనసాగిస్తుండగా ప్రేమలు సినిమా ఎప్పుడైతే రిలీజైందో అప్పటి నుంచి అక్కడ మిగతా భాషల్లో కూడా అమ్మడి పాపులారిటీ పెరిగింది. తన క్యూట్ లుక్స్ తో యూత్ ఆడియన్స్ కి ఫేవరెట్ హీరోయిన్ అయ్యింది మమితా బైజు. ప్రేమలుతో తెలుగు యువత మనసులు కూడా గెలుచుకుంది ఈ చిన్నది. ఐతే ఎవరైనా హీరోయిన్ తెలుగులో కాస్త క్రేజ్ తెచ్చుకుంటే చాలు వాళ్లకి వరుస ఆఫర్లు వస్తాయి. ప్రేమలు సక్సెస్ తో మమితాకు అలాంటి ఆఫర్లు వచ్చాయి. కానీ అప్పటికే ఆమె తమిళం, మలయాళ భాషల్లో సినిమాలు ఓకే చేయడం వల్ల ఇక్కడ సినిమాలు కుదరలేదు. ఐతే మమితాకు కూడా పర్సనల్ గా తెలుగు సినిమాల్లో నటించాలన్న ఆలోచన ఉందని తెలుస్తుంది.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# చూపు తిప్పుకోనివ్వని అందం.. 90ఎంఎల్ ఇచ్చినంత కిక్



తెలుగు లో 90ఎంఎల్ సినిమా తో పాటు ఛలో ప్రేమిద్దాం సినిమాలను చేసిన ముద్దుగుమ్మ నేహా సోలంకి. ఈ అమ్మడు మెల్ల మెల్లగా టాలీవుడ్ ప్రేక్షకులకు చేరువ అవుతోంది. అందమైన ఈ అమ్మడి యొక్క అందాల గురించి ఎంత మాట్లాడుకున్నా తక్కువే అన్నట్లుగా ఈ ఫోటో చూస్తుంటే అనిపిస్తుంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. సోషల్ మీడియాలో ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత పీక్స్ లో ఉంది. తాజాగా ఈ ఫోటోను షేర్ చేసి తనకంటే గొప్ప అందగత్తె ఉందా అన్నట్లుగా నేహా సోలంకి ఛాలెంజ్ విసిరినట్లు గా ఉందంటూ కామెంట్స్ వస్తున్నాయి. ప్రస్తుతం ముద్దుగుమ్మ యొక్క అందం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. క్లీ వేజ్ షో తో పాటు నడుము అందం ను సైడ్ యాంగిల్ లో చూపిస్తూ మతులు పోగొడుతున్న ముద్దుగుమ్మ అందాల విందు కు ప్రతి ఒక్కరు కూడా ఫిదా అవుతున్నారు. ఈ అమ్మడి యొక్క సినిమాల విషయానికి వస్తే గూడుపుఠాణి సినిమాలో నటిస్తోంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com